క్లుప్తంగా

బైబిల్ కళాశాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



శావల్యాపురం: స్థానిక విమోచన బైబిల్ కళాశాల్లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక స్టేట్‌బ్యాంకు మేనేజర్ వలేటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోకరక్షకుడని తెలిపారు. ఆయన చూపిన శాంతి, కరుణ, ప్రేమ, దయ మార్గంలో అందరు నడవాలని సూచించారు. తోటి వారికి సాయం చేయడం, ప్రేమించటం వల్ల మానవ సంబంధాలు బలపడతాయని తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బైబిల్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. యేజేస్కేలు, సీహెచ్.కస్తూరి, ప్రశాంత్ నిశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు విజయశ్రీ ఎంపిక



ఈపూరు (శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం బీపీఈడీ విద్యార్థిని ఎం. విజయశ్రీ దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట విక్టరీ కళాశాలలో ఈనెల 17,18 తేదీల్లో జరిగిన ఎంపిక పోటీల్లో విజయశ్రీ సత్తా చాటి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్‌బీ నాయక్,అరవింద్, దాసు, వంశీలు ఆమెను అభినందించినట్లు తెలియజేశారు.

యోగా పోటీలకు ఎన్ఈసీ విద్యార్థుల ఎంపిక



నరసరావుపేట రూరల్: సౌత్‌జోన్ యోగా పోటీలకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల (ఎన్ఈసీ) విద్యార్థులు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల యోగా పోటీలలో కళాశాల విద్యార్థులు నాగాంజలి, సీహెచ్. మారుతీ శ్రీనివాసరావు ప్రతిభ చూపి, పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు.భువనేశ్వర్‌లోని కేస్ యూనివర్సిటీలో ఈనెల 24,28 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో జేఎన్‌టీయూకే తరపున ఇద్దరూ ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం.వి. కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, వ్యాయామ అధ్యాపకులు ఎల్.కృష్ణారెడ్డి, ఎస్.ఆంజనేయులు, పి.విజయకుమార్ అభినందించారు.

రేపు మాజీ సీఎం వైఎస్. జగన్ పుట్టినరోజు వేడుకలు

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఉదయం 9గంటలకు గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి : డీఎస్పీ

చిలకలూరిపేట టౌన్: పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, కేసులు తదితర వాటిని పరిశీలించారు. సిబ్బందితో సమీక్ష ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు చేశారు.

అథ్లెటిక్స్‌లో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులకు పతకాలు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు యక్కల మధుసూదనరావు గురువారం తెలిపారు. తమ విద్యార్థులు సీహెచ్.వి.ఎం.గురుశంకర్ 200మీటర్లు, 400మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించాడని పేర్కొన్నారు. ఎస్. లాజర్ 800మీ, 1500మీ పరుగులో కాంస్యం, 4 గీ400 మీటర్లు రిలేలో కాంస్య పతకం సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాససాయి అభినందించారు.

చినుకుతో రైతుల్లో వణుకు



ధాన్యం రాశులపై పట్టాలు కప్పుతున్న రైతులు

రొంపిచర్ల: మండలంలో అకాల వర్షాలకు ముదురు వరి సాగు చేసిన రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. బుధ, గురువారాల్లో కురిసిన వర్షపు జల్లులకు వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఉదయానికి 2.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. మండలంలోని ఎడ్వర్డ్‌పేట, చాకలికుంట తండా, విప్పర్ల, రెడ్డిపాలెం, బిహరావారిపాలెం, మర్రిచెట్టుపాలెం, మాచవరం, నల్లగార్లపాడు, సంతగుడిపాడు గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు ముదురు వరి సాగు చేశారు. కోతలు సగానికి పైగా పూర్తయ్యాయి. వందలాది ఎకరాల్లో ధాన్యం కల్లాల్లోనే రాశులుగా ఉంది. పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. వర్షం సూచనతో కొందరు రైతులైలే కోతలు నిలుపుదల చేశారు. వర్షాలు కారణంగా ముందు జాగ్రత్త చర్యగా వరి కోతలు నిలుపుదల చేయాలని అధికారులు సూచనలు ఇస్తున్నారు. చేతికి వస్తున్న పంట వర్షం కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కానరాని కొనుగోలుదారులు

వర్షం కారణంగా ధాన్యం కొనుగోలుదారులు కూడా రావటం లేదు. వచ్చినా నిన్నటి వరకు 75 కేజీల బస్తా రూ.1600 పలికిన సన్నరకం ఒక్కసారిగా రూ. 100 వరకు ధర తగ్గింది. వ్యాపారులు రూ.1500కే అడుగుతున్నారు. చేసేది లేక రైతులు కొందరు అమ్ముకుంటుండగా, మరి కొందరు బస్తాల్లో నింపుకొని ట్రాక్టర్లతో ఇంటికి చేరవేసుకుంటున్నారు.

ధరలు పతనం



11 ఎకరాల్లో ముదురుగా సన్న రకం వరి సాగు చేశా. ఎనిమిది ఎకరాల్లో హార్వెస్టింగ్ పూర్తయ్యింది. మరో ఎకరంలో పనలపై ఉంది. మరో రెండు ఎకరాల్లో వరి పైరు హార్వెస్టింగ్ చేయాల్సి ఉంది. అయితే వర్షం రావటంతో కూలీలను పెట్టి పొలంలో ధాన్యాన్ని గ్రామ సమీపంలోకి చేరవేశాను. నిన్నటి వరకు పొలంలోనే రూ.1600 అడిగారు. వర్షం రావటంతో రూ.1500కే అడుతున్నారు. చేసేది లేక రాశులపై పట్టలు కప్పి వర్షానికి తడవకుండా భద్రపరుస్తున్నా ! – చెన్నారెడ్డి, రైతు

వరి కోతలు నిలుపుదల చేయండి



మండలంలోని రైతులు మూడు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలి. పొలాల్లో ఉన్న వరి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి. లేనిపక్షంలో పొలంలో ధాన్యం రాశులను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–శివలలిత, వ్యవసాయ అధికారి

కేంద్రీయ విద్యాలయం వద్ద జీబ్రాలైన్లు

సాక్షి స్పందన

నాదెండ్ల: జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి విద్యా సంస్థలు ఉన్న ప్రాంతాల్లో వాహనాల వేగనియంత్రణకు జీబ్రాలైన్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ సాక్షి దినపత్రికలో మలుపు భయపెడుతోంది శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గత రెండు రోజులుగా చిలకలూరిపేట–నరసరావుపేట మార్గంమధ్యలో ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం వద్ద జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జీబ్రాలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నాదెండ్ల: అడుగుకో గుంత... తీరేదెలా చింత.. అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. చిలకలూరిపేట శివప్రియనగర్ నుంచి నాదెండ్ల మీదుగా జంగాలపల్లె వరకూ 13 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతు పనుల కోసం రూ.40 లక్షలు కేటాయించిన విషయం విదితమే. సంకురాత్రిపాడు, జంగాలపల్లె గ్రామాల మధ్యనే మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. నాణ్యతా లోపాలుండటంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆర్ అండ్ బీ అధికారులు రెండు రోజులుగా సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయిస్తున్నారు.



నరసరావుపేట రహదారిపై కేంద్రీయ విద్యాలయం వద్ద రోడ్డుపై వేసిన జీబ్రాలైన్లు

సంక్షిప్తం

రేపు యడ్లపాడుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి రాక

యడ్లపాడు: విద్యా రంగంలో సేవా కార్యక్రమాల్ని విస్తరింపజేసేందుకు 'బాసట' సామాజిక, సాంస్కృతిక వేదికను ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు(శ్రీనివాస్) తెలిపారు. సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం యడ్లపాడు పీఆర్ విజ్ఞాన వేదికలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి టి. రజిని, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ పెయిన్ ఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ లింగమల్లు మోహనభాస్కరరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆవులు గోశాలకు తరలింపు

వినుకొండ(నూజెండ్ల): రోడ్లపై సంచరించే ఆవులను శనివారం గోశాలకు తరలిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 18న 72 ఆవులను పట్టుకున్నామని, అపరాధ రుసుం చెల్లించిన వాటిని యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. యజమానులు రాకపోవడంతో 14 ఆవులను మున్సిపాలిటీ సంరక్షణలో 90 రోజుల పాటు ఉంచామని పేర్కొన్నారు. పశు వైద్యులతో పరీక్షలు చేయించి శనివారం చిలకలూరిపేటలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం గోశాలకు తరలించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి, లక్ష్యాలపై ముగిసిన శిక్షణ

నాదెండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు– స్థానికీకరణ అంశంపై శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ నెల 16న ప్రారంభమైన కార్యక్రమంలో తొలి రెండు రోజులు పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 17 అంశాలపై శిక్షణనిచ్చారు. తదుపరి రెండు రోజులు సచివాలయాల్లోని అన్ని శాఖల సిబ్బందికి, కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధితో పాటు సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు స్థానిక నాయకులతో కలిసి అధికారులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, ఎంఈవో కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు

నరసరావుపేట: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని అవమానిస్తే ఎవరైనా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్‌పాల్ హెచ్చరించారు. పార్లమెంటు సమావేశంలో అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా గురువారం గడియారం స్తంభం సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గం వర్కింగ్ అధ్యక్షులు ఉస్తేలా జయరావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

నరసరావుపేట: అంబేడ్కర్, రాజ్యాంగాన్ని అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ డిమాండ్ చేశారు. డీసీసీ ఆధ్వర్యంలో గురువారం వినుకొండరోడ్డులోని ఓవర్‌బ్రిడ్జి సెంటర్‌లో నిరసన తెలిపారు. పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

హోం మంత్రి రాజీనామా చేయాలి

చిలకలూరిపేట: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు.

సఫాయి కర్మచారులచే మల, మురుగు శుభ్రం చేయించరాదు

నరసరావుపేట: పట్టణంలో సంస్థలు, అపార్టుమెంట్ వాసులు, ఇంకవరైనా నేరుగా వ్యక్తులు (సఫాయి కర్మచారులు)చే మలమురుగు, డ్రైలెట్రిన్, సెప్టిక్ ట్యాంకులు, సీవల్ లైన్లను శుభ్రం చేయిస్తే సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి శిక్షార్హులు అవుతారని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి, వాహనాల ద్వారానే ఆ పనులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు పథకం రూపొందించబడిందని తెలిపారు.

రెవెన్యూ రీసర్వే ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): రీసర్వేకు రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించాలని తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ కోరారు. మండలంలోని త్రిపురపురంలో గురువారం రీసర్వే పనులకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దారు రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ గ్రామాలు ఇరవై ఉన్నాయన్నారు. అందులో అగ్రహారం భూములకు సంబంధించిన అప్పాపురం,కొండ్రప్రోలు, తిమ్మాపురం రెవెన్యూ గ్రామాల్లో ప్రత్యేకంగా ప్రభుత్వం ఆదేశాలు మేరకు రీసర్వే పనులు జరుగుతాయని తెలిపారు. త్రిపురపురంలో 3,400 ఎకరాలను అధునాతన యంత్రాల ద్వారా సర్వే పనులు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. సర్వేలో తప్పులు జరగకుండా, భవిష్యత్‌లో భూవివాదాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, మాజీ సర్పంచ్ కోటిరెడ్డి, యలమంద, జక్కిరెడ్డి అబ్బిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై భగ్గుమన్న ప్రజలు



ఇందిరానగర్‌లో విద్యుత్ బిల్లులు దహనం

వినుకొండ: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసగా పట్టణంలోని ఇందిరానగర్‌లో బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడంతోపాటు సర్దుబాటు పేరుతో ప్రజల నుంచి భారీగా విద్యుత్ చార్జీలు వసూలు చేయడాన్ని విమర్శించారు. వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, షేక్ రంజాన్, తిరుమల లక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల నిరసన

నరసరావుపేట రూరల్: విద్యుత్ బిల్లులను పెంచడాన్ని నిరసిస్తూ చిరు వ్యాపారులు ఆందోళన చేపట్టారు. కేసానుపల్లి పరిధిలోని ఎల్‌టీ నగర్, లలితాదేవి కాలనీలో చిరు వ్యాపారులు బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. సర్దుబాటు పేరిట అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆదానితో కుదుర్చుకున్న డిజిటల్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని కోరారు. వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులకు విద్యుత్ బిల్లుల పెంపు మోయలేని భారంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో ఈపూరి లక్ష్మారెడ్డి, నాసరవలి, సుందరరావు, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని ఎనిమిది పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు ఆర్థిక సహాయంతో మోడల్ పేపర్లను అందజేశారు. మొత్తం 160 పుస్తకాలను ఇంగ్లిషు, తెలుగు మీడియంలో ముద్రించి అందించారు. ప్రధానోపాధ్యాయులు ఎ. శ్రీనివాసరావు, హనుమంతరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ మోడల్ పేపర్లు 10వ తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎం. రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ

నరసరావుపేట రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలని ఆర్డీవో కె.మధులత తెలిపారు. వినుకొండ రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం మహిళలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆర్డీవో హాజరై 22మంది మహిళలకు వాటిని అందించారు.కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు కపిలవాయి రాజేంద్రప్రసాద్, కోశాధికారి కట్టమూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

రీ సర్వే, ఎల్పీ నంబర్లు రద్దు చేయాలి

నరసరావుపేట రూరల్: రీ సర్వే, ఎల్పీ నెంబర్లు రద్దు చేసి స్థానిక సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని జొన్నలగడ్డ సచివాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు, ప్రజాసంఘాలు సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారి రఘుకి వినతిపత్రం అందజేశాయి.

24లోగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

జిల్లా ఎన్నికల పరిశీలన అధికారి ఐసీడీఎస్ కమిషనర్ సూర్యకుమారి

యడ్లపాడు: 2025 జనవరి తొలివారంలో ప్రకటించే తుది ఓటర్ల జాబితా వివరాలను తప్పుల్లేకుండా సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలన అధికారి ఐసీడీఎస్ కమిషనర్ సూర్యకుమారి చెప్పారు. యడ్లపాడు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపులు, మార్పులు, చేర్పులు తదితర దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫారం–6,7,8 దరఖాస్తులను ఈనెల 24లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జాబితా తయారీలో పెండింగ్ పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. సమీక్ష అనంతరం గ్రామంలోని ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులతో సందర్శించారు.

అర్జీలకు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు



పొట్లూరు గ్రామసభలో అర్జీ తీసుకుంటున్న తహసీల్దారు సుజాత

శావల్యాపురం: రెవెన్యూ గ్రామసభల్లో రైతులు అందజేసే అర్జీలకు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తహసీల్దారు కె.సుజాత తెలిపారు. మండలంలోని పొట్లూరు గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభలో రైతులు ఇచ్చిన అర్జీలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి త్వరితగతిన పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల నుంచి 50 అర్జీలు తీసుకున్నట్లు తెలిపారు.

భూ సమస్యలకు పరిష్కారం

బొల్లాపల్లి : రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరచుకోవాలని తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. మండలంలోని పలుకూరులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు. పలుకూరులో ఎనిమిది అర్జీలు అందాయని ఆయన చెప్పారు.

సమస్యలను పరిష్కరించండి

రొంపిచర్ల: గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ బండి నిర్మలకు గురువారం వినతి పత్రం అందజేశారు. రొంపిచర్లలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో వారు వినతి పత్రం అందించారు. ప్రధానంగా హైవే మీద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను ఎత్తి వేయాలని కోరారు. మంచినీటి పైపులైన్ల కోసం పగుల గొట్టిన రోడ్లలో గోతులు పూడ్చాలని తదితర డిమాండ్‌లతో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ సరికొండ వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు ఏఎంజీ విద్యార్థుల ఎంపిక



చరణ్, నాగచైతన్య

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు సత్తెనపల్లి మండలం ధూళిపాళలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు గుంజి చరణ్, తూపాటి నాగచైతన్య ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్టు బంగారుపతకం సాధించటంలో క్రియాశీల పాత్ర పోషించారు. దీంతో ఇద్దరు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బేస్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో జనవరి 15 నుంచి 18 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులకు ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, స్కూల్ హెచ్‌ఎం కె. కృపాదానం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహారావు తదితరులు అభినందనలు తెలిపారు.

వర్సిటీ జట్టుకు కేబీఆర్ విద్యార్థి ఎంపిక



నరేంద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ జట్టుకు కేబీఆర్ కళాశాల విద్యార్థి పి.నరేంద్ర ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సిహెచ్.వి.నాగిరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్ గురువారం తెలిపారు. వర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో నరేంద్ర 1500 మీటర్లు, 3000 మీటర్లు స్టీపుల్ ఛేజ్ విభాగంలో బంగారు పతకంతో వర్సిటీ జట్టులో స్థానం సాధించినట్టు వివరించారు. ఈనెల 26న భువనేశ్వర్‌లోని కేఐఐటీ యూనివర్సిటీలో నిర్వహించనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.వెంకటశివ అధ్యాపకులు అభినందించారు.

వినియోగదారుల దినోత్సవంపై పోటీలకు స్పందన

నరసరావుపేట ఈస్ట్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 64మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లిష్ మీడియం వ్యాసరచనలో కె.కాత్యాయని (జెడ్పీ హైస్కూల్, కాకాని), ఎం.ప్రణీత్‌రాజు (కండ్లకుంట), ఎం.తేజస్విని (ఉప్పలపాడు), వక్తృతంలో వి.కాత్యాయని (కాకాని), కె.ఇమ్మానియేల్ (మున్సిపల్ బాలుర పాఠశాల, నరసరావుపేట), కె.కార్తిక్ (కనపర్రు) బహుమతులు సాధించారు. తెలుగు విభాగం వ్యాసరచనలో జి.జ్యోతి (కాకాని), జె.భవ్య (కోటప్పకొండ), కె.ఎస్తేరురాణి (కాకాని), వక్తృత్వంలో ఎం.మణిగౌతమ్ (కండ్లగుంట), ఎస్.హేమవనితారెడ్డి (మాచర్ల), సీహెచ్.శృతిశ్రీ కాకాని బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం షేక్.సుభాని, జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ సైన్స్ అధికారి ఏ.ఏ.మధుకుమార్, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ షేక్ ఆయేషాసుల్తానా, ఇన్‌చార్జ్ హెచ్ఎం చిట్టెమ్మ, టి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ వాహన సాంకేతికతపై శిక్షణ



దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యుత్ వాహన సాంకేతికతపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టూడెంట్ బ్రాంచ్, ఆర్ఈ ట్రాన్ ఎనర్జీస్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎవరెట్రోన్ ఎనర్జీస్ ఇండియా డైరెక్టర్ బర్ల దినేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ వాహనాల రంగంలో నిష్ణాతులుగా ఎదగడానికి కావాల్సిన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగం వేగవంతమైన వృద్ధిని సాధిస్తుందని తెలిపారు. దేశ ఆటోమోటివ్ మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు 40శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వైఎస్. కిశోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ట్రోల్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

వినుకొండ(నూజెండ్ల): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్న వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం టీఎస్‌యూఎస్ సభ్యులు ఫిర్యాదు చేశారు. టీఎస్‌యూఎస్ వాట్సాప్ గ్రూపులో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ సీహెచ్. సుభాష్‌చంద్రబోస్ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, బి. హైమారావు తదితరులను మన్నం శ్రీనివాస్ అనే వ్యక్తి అభ్యకరమైన పోస్టులు ద్వారా ట్రోల్ చేస్తున్నాడని తెలిపారు. గ్రూపు సభ్యులను ఆవేదనకు గురి చేశారని, వెంటనే చర్యలు తీసుకోవాలని బెజవాడ నాగేశ్వరరావు కోరారు.

రోడ్డు ప్రమాదంలో పలువురుకి స్వల్ప గాయాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణ సమీపంలోని లయోలా హైస్కూల్ వద్ద గురువారం ఉదయం రెండు వాహనాలు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108 సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.